జై శ్రీకృష్ణ

వైభవంగా జన్మాష్టమి వేడుకలు

కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధిలో గురువారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు కనుల పండువగా జరిగాయి. ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తల్లిదండ్రులు పిల్లలను చిన్ని కృష్ణుడు, గోపికల వేషధారణలో అలంకరించారు. అదే విధంగా పాఠశాలల్లో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణాష్టమి విశిష్టతను విద్యార్థులకు వివరించారు. భారత సాంస్కృతి సంప్రదాయాల పట్ల విద్యార్థులకు అవగాహన ఉండాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని వేడుకగా నిర్వహించామని పాఠశాలల యాజమాన్యాలు పేర్కొన్నాయి. – కూకట్‌పల్లి/ఓల్డ్‌బోయిన్‌పల్లి



కూకట్‌పల్లిలోని అక్షర ఇంటర్నేషనల్ స్కూలు బ్రాంచిలో ఉట్టి కొడుతున్న చిన్ని కృష్ణులు



ఎనిమిది విడతల్లో డబుల్ ఇళ్లు ఇస్తాం

- ఇళ్లు అమ్మితే క్రిమినల్ కేసులు పెడతాం
- మార్చి, ఏప్రిల్ వరకు అర్హులందరికీ ఇస్తాం
- అల్లాపూర్ డివిజన్ పాదయాత్రలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



పాదయాత్రలో సమస్యలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ సబిహా బేగం తదితరులు



ఎమ్మెల్యేకు స్వాగతం పలుకుతున్న మహిళలు



కల్యాణలక్ష్మి చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే

మోతీనగర్: కాంగ్రెస్, బీజేపీ హయాంలోనే చెరువులు, కుంటలు, ప్రభుత్వ స్థలాలు కబ్జాకు గురయ్యాయని కూకట్‌పల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పేర్కొన్నారు. గురువారం అల్లాపూర్ డివిజన్‌లోని గాయత్రినగర్, జ్యోతినగర్, వెంకటసాయి గ్రీన్ సిటీలో ఆయన పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా స్థానికుల సమస్యలు, అందుతున్న సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. అనంతరం చంద్రాగార్డెన్స్‌లో జరిగిన కార్యక్రమంలో 100 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సున్నం చెరువు నుంచి ముళ్లకత్వా చెరువు వరకు నాలా విస్తరణలో భాగంగా ఇళ్లు కోల్పోతున్న 90 మంది వారికి రెండో విడతలో డబుల్ బెడ్‌రూమ్‌లు ఇచ్చిన వెంటనే తక్షణం పనులు చేపడతామన్నారు. నాలా విస్తరణ పనులు చేపడితే లోతట్టు సమస్య శాశ్వతంగా తీరుతుందని అన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలో ఎనిమిది విడతలుగా మార్చి, ఏప్రిల్ వరకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను అర్హులైన ప్రతి ఒక్కరికి అందజేస్తామని తెలిపారు. ఆ ఇళ్లను అమ్మిన వారిపై కొన్న వారిపై క్రిమినల్ కేసులు పెడతామన్నారు.

చెరువులు, నాలాల అభివృద్ధికి సుమారు రూ.500 కోట్లు కేటాయించాం...

◆ సర్వే నం.18లో ప్రభుత్వ ఉన్నత, ఉర్దూ పాఠశాలను దాతల సహాయంతో సుమారు రూ.5కోట్లతో నిర్మిస్తామని అన్నారు. అదే విధంగా పద్మావతి నగర్, జ్యోతినగర్‌వాసులకు కమ్యూనిటీ హాల్ కోసం స్థలం కేటాయిస్తామని తెలిపారు. రూ.56 కోట్లతో ఇప్పటికే రామారావునగర్ నుంచి బబ్బుగూడ అవంతినగర్ తోట వరకు రిటర్నింగ్ వాల్ నిర్మాణం చేపట్టామన్నారు. రూ.60లక్షలతో సీనియర్ సిటిజన్ భవనం పూర్తి చేసుకొని ప్రారంభించామని తెలిపారు. సుమారు రూ.500 కోట్లను నియోజకవర్గంలోని చెరువులు, నాలాల అభివృద్ధి కోసం కేటాయించామని తెలిపారు. ఎన్నో ఏళ్లుగా పరిష్కారం కాని సమస్యలు సైతం రాష్ట్రం ఏర్పడిన తరువాత ముఖ్యమంత్రి కేసీఆర్ పర్యవేక్షణలో చేపట్టామని తెలిపారు. ముఖ్యంగా అల్లాపూర్ డివిజన్‌లో గతంలో అల్లాపూర్ డివిజన్‌లో మంచినీటి కొరతతో ఏ నాయకుడు వచ్చినా బిందెలతో నిరసనలు తెలిపే రోజులు పోయాయని, కులాయి తిప్పగానే మంచినీరు వచ్చే రోజులు వచ్చాయన్నారు. బ్యాంక్ కాలనీ నుంచి కైత్లాపూర్ వరకు బ్రిడ్జి నిర్మాణంతో ట్రాఫిక్ సమస్యకు చెక్ పెట్టామన్నారు. మల్కాజ్‌గిరి ఎంపి రేవంత్ రెడ్డి గెలిచిన తరువాత ఏ రోజు కూడా పర్యటించిన పాపాన పోకపోవటంతో పాటు ఎటువంటి నిధులు మంజూరు చేయలేదని విమర్శించారు.

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావును మంత్రిగా చూడాలి...

◆ ఈ సందర్భంగా కార్పొరేటర్ సబిహా బేగం మాట్లాడుతూ... ఆడపిల్లల తల్లిదండ్రులు ఆర్థికంగా ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి కేసీఆర్ కల్యాణలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టారన్నారు. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆధ్వర్యంలో ఇప్పటి వరకు వేల మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను లబ్ధిదారులకు అందజేశారని తెలిపారు. రాబోయే రోజుల్లో ఎమ్మెల్యే కృష్ణారావును మరోసారి ఆశీర్వదించి భారీ మెజార్టీతో గెలిపించుకుందామని తెలిపారు. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావును రానున్న ప్రభుత్వంలో మంత్రిగా చూడాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా మైనార్టీ అధ్యక్షుడు మహమ్మద్ గౌసుద్దీన్, డివిజన్ అధ్యక్షుడు లింగాల ఐలయ్య, కోఆర్డినేటర్ టి. వీరారెడ్డి, ప్రధాన కార్యదర్శి పిల్లి తిరుపతి, యూత్‌విభాగం అధ్యక్షుడు దేవిరెడ్డి మస్తాన్ రెడ్డి, ఎస్‌సీ విభాగం అధ్యక్షుడు జ్ఞానేశ్వర్, నాయకులు మహ్మద్ జాహెద్ షరీఫ్ బాబా, అబ్దుల్ హమీద్, మాధవాచారి, శ్రీనివాసరెడ్డి, దుర్గ, సయ్యద్ నజ్మా, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

డివిజన్ రూపురేఖలు మార్చిన ఘనత ఎమ్మెల్యేదే..



ఓల్డ్ బోయిన్‌పల్లి: అభివృద్ధితో ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ రూపురేఖలే మార్చిన ఘనత మన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకే దక్కుతుందని కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ అన్నారు. గురువారం డివిజన్ పరిధిలోని గంగపుత్ర సంఘం దగ్గర రూ.29 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న డ్రైనేజీ పైపులైన్ పనులను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వాటర్‌వర్క్స్ మేనేజర్ తేజ, జీహెచ్‌ఎంసీ ఏఈ అరవింద్ వర్క్‌ఇన్‌స్పెక్టర్లు శ్రీకాంత్, ఓం ప్రకాశ్, ఉద్యమకారుడు వాసుయాదవ్, నాయకులు ఇర్ఫాన్, హరినాథ్, లలిత, ఏజాజ్, జంగయ్య, మట్టి శ్రీను, బుర్రి యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు కుట్టు మెషిన్ల అందజేత



కుట్టుమెషిన్లను అందజేస్తున్న లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కేల వెంకట్రావ్

మోతీనగర్: నిరుపేదల కోసం లయన్స్ క్లబ్ బంజారాహిల్స్ శాఖ ఎప్పుడు ముందు ఉంటుందని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కేల వెంకట్రావ్ పేర్కొన్నారు. గురువారం అల్లాపూర్ డివిజన్ శ్రీవివేకానందనగర్‌లో మహిళలకు ఆయన కుట్టు మెషిన్లను అందజేశారు. అనంతరం రెయిన్‌బో పాఠశాలలో ఉచిత నేత్ర వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉచిత మెగా వైద్య శిబిరం, అన్నదానం, వస్త్రదానం, పాఠశాల విద్యార్థులకు నోటు పుస్తకాలు వంటి ఎన్నో సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని పేర్కొన్నారు. అవసరమైన వారికి శస్త్ర చికిత్సలు సైతం చేయిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కైలాష్, క్రాంతికర్, రోణంకి జగన్నాథం, నాగుల సత్యం గంగపుత్ర, ఆదినారాయణ, ప్రతాప్, పీఆర్‌కే, అమర్‌సింగ్, కిరణ్, శ్రీలత, రాధిక, రాణి తదితరులు పాల్గొన్నారు.

100 మందికి కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే అరెకపపూడి గాంధీ, కార్పొరేటర్లు

అల్విన్‌కాలనీ: శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను గురువారం ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్లు దొడ్ల వెంకటేష్‌గౌడ్, జూపల్లి సత్యనారాయణ, నార్నే శ్రీనివాసరావు, మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావులతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 100 మంది లబ్ధిదారులకు చెక్కులను అందజేశామన్నారు. మొత్తం 200 మంది లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తామన్నారు. పేదల సంక్షేమమే ధ్యేయంగా సీఎం కేసీఆర్ ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో అమలు చేయని సంక్షేమ పథకాలను తెలంగాణ ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తూ పేదలకు ఎంతో ఆసరాగా నిలుస్తోందన్నారు. పథకాల అమలులో తెలంగాణ ప్రభుత్వం దేశానికే ఆదర్శంగా నిలుస్తుందంటే సీఎం కేసీఆర్ పనితీరుకు నిదర్శనమన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్‌వి శ్రీనివాస్‌రెడ్డి, గ్రంథాలయ డైరెక్టర్ గణేష్ ముదిరాజ్, పార్టీ కూకట్‌పల్లి అధ్యక్షుడు లక్ష్మీ నారాయణ పాల్గొన్నారు.

ఘనంగా కృష్ణస్వామి ముదిరాజ్ జయంతి

బాలానగర్: హైదరాబాద్ మాజీ మేయర్ కృష్ణస్వామి ముదిరాజ్ జయంతి వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. గురువారం బాలానగర్‌లోని శోభన సెంటర్‌లో కూకట్‌పల్లి ముదిరాజ్ మహాసభ ఆధ్వర్యంలో కొరివి కృష్ణస్వామి ముదిరాజ్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా ఓబీసీ సభ్యులు చెన్నయ్య ముదిరాజ్, కూకట్‌పల్లి ముదిరాజ్ మహాసభ చైర్మన్ సుదర్శన్, జి.రాజు, పిట్ల రాజు, పి.తిరుపతి, కె.రాజు పటేల్ పాల్గొన్నారు.

కొమ్మలు కిందపడి విద్యుత్ సిబ్బందికి గాయాలు

మూసాపేట: విద్యుత్ తీగలకు అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగిస్తున్న విద్యుత్ సిబ్బంది ప్రమాదవశాత్తు కింద పడి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం బోరబండకు చెందిన మహ్మద్ ఇలియాస్ (40) విద్యుత్ సిబ్బందిగా పనిచేస్తున్నాడు. 24 గంటలు డ్యూటీలో ఉండి తరువాత రోజు సెలవు ఉంటుంది. కానీ వరుసగా కురుస్తున్న వర్షాలకు 3 రోజులు డ్యూటీ వేశారు. రిలీవర్‌గా వచ్చే వ్యక్తి రాకపోవడంతో ఇతనినే డ్యూటీలో ఉంచడంతో నిద్ర లేకపోవడంతో ప్రమాదం జరిగిందన్నారు. ఆంజనేయనగర్‌లో బుధవారం రాత్రి కరెంటు పోవడంతో చెట్ల కొమ్మలను తొలగించేందుకు చెట్టు ఎక్కి పని చేస్తుండడం వల్ల కింద పడి గాయాలు అయ్యాయి. ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

అభ్యర్థిత్వాన్ని ఆమోదించాలని పవన్‌కుమార్ దరఖాస్తు

కూకట్‌పల్లి: బీజేపీ అధిష్టానం వచ్చే ఎన్నికల్లో 33 శాతం సీట్లు మహిళలు, 30శాతం యువకులకు అవకాశాలు కల్పిస్తామని ప్రకటించిన విషయం తెలిసిందే. దీంతో కూకట్‌పల్లి నియోజకవర్గంలోని రాష్ట్ర యువమోర్చా నాయకుడు నాయినేని పవన్‌కుమార్ గురువారం రాష్ట్ర పార్టీ కార్యాలయానికి వెళ్లి తన అభ్యర్థిత్వాన్ని ఆమోదించాలని దరఖాస్తు చేసుకున్నారు. కూకట్‌పల్లి లేదా శేరిలింగంపల్లి నియోజకవర్గం నుంచి తనకు అవకాశం కల్పిస్తారని ఆశిస్తున్నానని పేర్కొన్నారు.

ఆర్థిక సమస్యలతో యువకుడు ఆత్మహత్య

జీడిమెట్ల: ఆర్థిక సమస్యలతో బాధపడుతున్న ఓ యువకుడి ఉరి వేసుకుని మృతిచెందిన సంఘటన జీడిమెట్ల పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ పవన్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం శ్రీకాకుళం జిల్లాకు చెందిన అలుగోలు నారాయణరావు (26) రాధ భార్యభర్తలు వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. వీరు బతుకుదెరువు కోసం నగరానికి వలస వచ్చి కుత్బుల్లాపూర్‌లోని వేణుగోపాలస్వామి గుడిసమీపంలో ఓ గదిని అద్దెకు తీసుకుని ఉంటున్నారు. కాగా నారాయణరావు గత కొన్ని నెలలుగా ఆర్థిక సమస్యలతో బాధపడుతున్నాడు. వారం క్రితం నారాయణరావు భార్య రాధ పని నిమిత్తం పిల్లలను తీసుకుని సొంత ఊరికి వెళ్లిపోయింది. కాగా నారాయణరావు ఒక్కడే గదిలో ఉంటున్నాడు. బుధవారం సాయంత్రం నారాయణరావు ఇంటి యజమాని రాధకు ఫోన్ చేసి నారాయణరావు ఇంట్లో ఉరి వేసుకుని మృతిచెంది ఉన్నాడని తెలిపాడు. ఈ విషయాన్ని పోలీసులకు సమాచారం అందించగా పోలీసులు మృతదేహాన్ని పోస్టు మార్టమ్ నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ట్రావెల్స్ బస్ ఢీకొట్టడంతో యువకుడి మృతి

మూసాపేట: బైక్‌పై వెళుతున్న ఓ యువకుడిని బస్ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ వారాసిగూడకు చెందిన కె. వెంకటేష్(23) సెంట్రింగ్ పని చేస్తున్నాడు. కేపీహెచ్‌బీ నుంచి వారాసిగూడకు వెళ్తుండగా కూకట్‌పల్లి సౌత్ ఇండియా షాపింగ్ మాల్ వద్ద బైక్‌పై వెళ్తున్న యువకుడిని ప్రైవేట్ ట్రావెల్ బస్ ముందరి టైర్ తగలడంతో బైక్ అదుపు తప్పి కింద పడిపోయాడు. వెనుక టైర్ అతడి మీద నుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కూకట్‌పల్లి పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని గాంధీ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.



యూజీడీ పనులు ప్రారంభం

బాలానగర్: జవహర్‌నగర్‌లో నూతన డ్రైనేజీ లైన్ల వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నట్లు ఫతేనగర్ డివిజన్ కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ తెలిపారు. ఫతేనగర్ డివిజన్ పరిధిలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సహకారంతో రూ.10లక్షల వ్యయంతో యూజీడీ పనులను జలమండలి మేనేజర్ అనిల్‌కుమార్, స్థానిక సంక్షేమ సంఘం సభ్యులతో కలిసి ప్రారంభించారు. పనులను నాణ్యతా ప్రమాణాలతో ఖచ్చితంగా పాటించాలని సూచించారు. రాము, కీర్తి, శ్రవణ్, వెంకటేష్, రాయుడు పాల్గొన్నారు.

జిల్లా బీజేపీ అధికార ప్రతినిధిగా సీతారామరాజు



భాగ్యనగర్‌కాలనీ: మేడ్చల్, మల్కాజ్‌గిరి అర్బన్ జిల్లా బీజేపీ అధికార ప్రతినిధిగా హైదర్‌నగర్‌కు చెందిన బొల్లేపల్లి సీతారామరాజును నియమించారు. గురువారం జిల్లా అధ్యక్షుడు పన్నాల హరీష్‌రెడ్డి ఆయనకు నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సీతారామరాజు మాట్లాడుతూ.. శేరిలింగంపల్లి నియోజకవర్గంలో బీజేపీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. పార్టీ ప్రకటించిన అభ్యర్థి గెలుపు కోసం పనిచేస్తానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన జిల్లా అధ్యక్షుడు పన్నాల హరీష్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవికుమార్‌యాదవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

నియామకం



మారెళ్ల శ్రీనివాస్

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా మారెళ్ల శ్రీనివాస్ గురువారం నియమితులయ్యారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ జైపాల్ చేతుల మీదుగా ఆయన నియామకపత్రాన్ని అందుకున్నారు. అనంతరం భారత్ జోడో యాత్ర ప్రారంభించి ఏడాది పూర్తయిన సందర్భంగా లింగంపల్లిలోని అంబేడ్కర్ విగ్రహం నుంచి రాజీవ్ గాంధీ విగ్రహం వరకు ర్యాలీ చేశారు. అనంతరం మారెళ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి డివిజన్ అధ్యక్ష పదవి కట్టబెట్టినందుకు టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, జైపాల్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నాని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో శేరిలింగంపల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించేలా తన వంతు కృషి చేస్తానని అన్నారు.